RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844

మార్చి : 27 బుదవారం సంపుటి : 29 సంచిక : 65


## కోడిపందేల శిబిరంపై మెరుపు దాడులు



అగ్ని న్యూస్,కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు గ్రామంలో కోడిపందాలు శిభిరంపై మంగళవారం పోలీసులు మెరువు దాడులు నిర్వహించారు. మునగపాడు గ్రామం శివారు ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ మాధవరావు, పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్దనుండి రెండు కోడి పుంజులు ,రూ 1750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల నియమావళి పై
## సబ్ కలెక్టర్ సమీక్ష




అగ్ని న్యూస్,పొదిలి: ఎన్నికల నియమావళిలో భాగంగా మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా పొదిలి, కొనకనమిట్ల బిఎల్ఓ లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వాహణ అధికారులకు పలు సూచనలు చేశారు. రాజకీయ నాయకుల ప్రచార వాహనాలకు,బహిరంగ సమావేశాలకు అనుమతులు తప్పనిసరి అని ఇంటింటికి ప్రచార అనుమతులు ఉన్నాయా లేదా చూడాలని సూచించారు. శాసనసభ అభ్యర్ధి రూ 40 లక్షలు ఖర్చు మించకుడదని వీటన్నటిని తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు.ఎక్కడైనా అభ్యర్థులు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. సెల్ ఫోన్ తో సూచించిన నెంబర్ కు వెంటనే అప్ లోడ్ చేయాలని తెలిపారు. అక్రమార్కులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, తహశీల్దార్,ఇఓఆర్డిఓ, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 29న నియోజకవర్గ వైకాపా నాయకుల సమావేశం



అగ్నిన్యూస్, గిద్దలూరు : ఈనెల 29వ తేదీన గిద్దలూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి కెపి నాగార్జునరెడ్డి కోరారు. మంగళవారం ఆయన 29న నిర్వహించే సమావేశం విజయవంతం కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముఖ్యనాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి హాజరుకానున్నందున అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు హాజరు కావాలని కెపి కోరారు. సమావేశంలో వచ్చే ఎన్నికల్లో గెలుపుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించడం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న
## వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించండి- అన్నా చైతన్య



అగ్ని న్యూస్, పొదిలి: రాష్ట్రంలోని పేద ప్రజలకు సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని మరలా ఆదరించి ఆశీర్వదించాలని మార్కాపురం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు యంగ్ డైనమిక్ లీడర్ అన్నా కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం పొదిలి నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డ్ దర్శి రోడ్డు అపార్ట్మెంట్, రాంనగర్, ఆదాంనగర్ ఏరియా లోని పలు వీదుల్లోని ప్రతి ఇంటింటికి తిరిగి మార్కాపురం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి అన్నా రాంబాబు , ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి వేయించి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నా తనయుడు అభ్యర్థించారు. సందర్భంగా ఎమ్మెల్యే అన్నా తనయుడు మాట్లాడుతూ ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా.. లంచాలకు, వివక్షకు తావులేకుండా.. నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైసీపీ అన్నారు. కావున రాబోయే ఎన్నికల్లో జగనన్నకు, వైసీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే అన్నా తనయుడు కోరారు. ముందుగా ఎమ్మెల్యే అన్నా తనయుడుని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు , ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో పొదిలి మండల, పట్టణ వైసీపీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల కన్వినర్ లు, జే సి యస్ ఇంచార్జి లు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, సచివాలయ కన్వినర్ లు, గృహ సారదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి



అగ్ని న్యూస్, ఒంగోలు: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యమని,ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడమే ధ్యేయమని జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి తెలిపారు.సమస్యాత్మక,అతి సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సమావేశాలను నిర్వహించాలని సూచించారు.గ్రామాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు తలెత్తకుండా ప్రణాళికాబద్ధమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లాలోని 18 ముఖ్యమైన చెక్ పోస్టులు వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. 426 ఎలక్టోరల్ అఫెండర్లు , 887 రౌడీ షీటర్లు బైండోవర్ చేయడం జరిగిందని, ఇప్పటి వరకు రూ 1,79,95,000 నగదు, 214 గ్రా.ల బంగారం, 1872 లీటర్ల అక్రమ మద్యం, 80.3 గ్రాముల మాదకద్రవ్యాలతో పాటు 40 కేజీల పాంగోలిన్ జంతు పొలుసులు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి హెచ్చరించారు.

## ఎరిక్షన్ బాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఎమ్మార్పీఎస్



అగ్ని న్యూస్,యర్రగొండపాలెం: మే 13న జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం ఎరిక్షన్ బాబును ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం కలసి సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథి గా పాల్గొని మాట్లాడుతూ ఎరిక్షన్ బాబు గెలుపు కోసం యర్రగొండపాలెం నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి ఇంటింటికి గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తా మన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ పరిష్కారం కావాలన్నా , మాదిగల జీవితాల్లో వెలుగులు నింపాలంటే చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రావాలన్నారు.చంద్రబాబు నాయుడు గెలుపు మాదిగల గెలుపుగా చూడాలని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో వర్గీకరణ జరిగిన కాలంలో మాదిగ జాతికి 23 వేల ఉద్యోగులు రావడం జరిగిందన్నారు. అలాగే చదువుకుంటున్న విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కూడా రావడం జరిగిందని అన్నారు. వర్గీకరణ ఉంటేనే మాదిగ జాతికి మేలు జరుగుతుందని తెలిపారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతాన్నారు. మాదిగ జాతిని మోసం చేసిన జగన్మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతియ ఉపాధ్యక్షులు జలదంకి నరశింగరావు మాదిగ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదిమూలపు ప్రకాష్ మాదిగ, ఎంఆర్పిఎస్ జిల్లా అధికారి ప్రతినిధి గర్నిపూడి వినయ్ మాదిగ, చేదూరి సుబ్బు మాదిగ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి,భూషణం మాదిగ దోర్నాల మండల నాయకులు, డేవిడ్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన





## జగనన్న పాలనలో గడప వద్దకే ప్రభుత్వ సేవలు

### వైకాపా అభ్యర్థులను గెలిపించండి...కృష్ణచైతన్య

### ఘన స్వాగతం పలికిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

అగ్నిన్యూస్, పొదిలి: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొని వచ్చి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించారని మార్కాపురం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య తెలిపారు. మంగళవారం పొదిలి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులోని బాప్టిస్ట్ పాలెం, టైలర్స్ కాలనీ ప్రాంతాల్లోని పలు వీదుల్లో ప్రతి ఇంటింటికి తిరిగి మార్కాపురం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి అన్నా రాంబాబు ను, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి వేయించి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా తనయుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీయం జగనన్నదే అన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా పలు సంక్షేమ పథకాలతో పాటు .. ప్రజా ప్రయోజనాల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారుపేరుగా పాలన సాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తూ అందరి సంక్షేమం, అభ్యున్నతికై వైయస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. సచివాలయ వాలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రభుత్వ పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తున్నారని చెప్పారు. ముందుగా ఎమ్మెల్యే అన్నా తనయుడుని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు , ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో పొదిలి మండల, పట్టణ వైసీపీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల కన్వినర్ లు, జే సి యస్ ఇంచార్జి లు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, సచివాలయ కన్వినర్ లు, గృహ సారదులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీలు



అగ్ని న్యూస్,తర్లుపాడు: మండల కేంద్రమైన రైల్వేస్టేషన్ వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎలక్షన్ లో భాగంగా ఎలక్షన్ స్క్వాడ్ యమ్ అరుణ కుమారి తనిఖీ నిర్వహించారు. తనిఖీలతో పాటు ఎలక్షన్ కోడ్ అమలు లో ఉండటంతో వాహనాలపై ఉన్న పార్టీ సింబల్స్ ని ఆపి వాటిని సిబ్బంది తొలగించారు. వచ్చే వాహన దారులకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున అధిక మొత్తం లో డబ్బులు, బిల్లు లు లేకుండా ఎటువంటి వస్తువులు తరలిస్తుంటే వారిపై తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

# టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



అగ్నిన్యూస్, పొదిలి: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తనయుడు విఘ్నేష్‌రెడ్డి అన్నారు. గత 5 సంవత్సరాల జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. ప్రగతి పట్టాలెక్కాలంటే చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. మంగళవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి పట్టణంలోని 7వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికలలో తన తండ్రిని గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో పొదిలి పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# టీడీపీ అభ్యర్థి గూడూరిని కలిసిన బీజేపీ నాయకులు



అగ్నిన్యూస్, యర్రగొండపాలెం : ఎన్డీఎ కూటమి యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరు విరెక్షన్ బాబుని నియోజకవర్గ బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భారతీయ జనతా పార్టీ నాయకులు నియోజవర్గ కోకన్వీనర్ బిందెల నరసయ్య ఆధ్వర్యంలో యూత్ నాయకులు తంగిరాల అశోక రెడ్డి ,దోర్నాల మండల మాజీ అధ్యక్షులు తంగిరాల సీతారామిరెడ్డి, పుల్లలచెరువు మండల అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, త్రిపురాంతకం మండల అధ్యక్షులు నలబోతుల వీరాంజనేయ యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి యోగేశ్వరరావు, త్రిపురాంతకం మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు తిమోతి, విస్తార కమిటీ నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కొరకు గూడూరు ఎరక్షన్ బాబుని భారీ మెజార్టీ తో ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషిచేస్తామని బీజేపీ నాయకులు ప్రకటించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి

### ఎమ్మెల్యే అన్నా రాంబాబు




అగ్ని న్యూస్,మార్కాపురం: రాజ్యాంగ స్ఫూర్తికి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని ఎన్ హెచ్ ఆర్ సి చైర్మన్ గా డాక్టర్ జాబ్ దానంకు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ కౌన్సిల్ గుంటూరు నెల్లూరు, ప్రకాశం, మూడు జిల్లాల జోన్ చైర్మన్ గా మార్కాపురం పట్టణానికి చెందిన డాక్టర్ జోబ్ దానంను సోమవారం రాత్రి ఆ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ డాక్టర్ ఆర్.జాన్ రాజు నియామక పత్రం అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు ఎమ్మెల్యే మార్కాపురం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు ప్రత్యేక అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకై సామాజిక న్యాయముతో పనిచేస్తూ ముందుకెళ్లాలని తెలిపారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ షంషీర్ అలీ బేగ్, పి.ఎల్.పి.యాదవ్, ఫాదర్ మంచా ఏలియా, డాక్టర్ ప్రభాకర్, కె.వరప్రసాద్, జి.రత్నబాబు, కలవకూరి రాజు కుమార్ పాల్గొన్నారు

# మొన్న ఒక పార్టీ... నేడు మరో పార్టీ.. మరి రేపు ఏ పార్టీలో ఉంటారో...

## గోడ మీద పిల్లుల మాదిరిగా చోటా నాయకులు

## వచ్చేవారితో,, పోయేవారితో సందడిగా మారిన రాజకీయాలు

(అగ్నిన్యూస్ ప్రతినిధి,ఒంగోలు)

ప్రకాశం జిల్లాలో రాజకీయాలు రంగులు మారుతున్నాయి. నాయకులే కాదు,, ఓటర్లు కూడా రోజుకో పార్టీలో ప్రత్యక్షం అవుతున్నారు. ఎవరు ఏ గ్రూపులో ఉన్నారు,, ఏ గ్రూపు ఏ పార్టీకి అండగా ఉంటుందనేది తేల్చడం కనాకష్టంగా మారింది. అట్టహాసంగా పార్టీలు మారిన వారు రోజు మారేలోపుగానే పాత పార్టీలోకి జంప్ అవుతుండడం ఆందోళన కలిగించే అంశమే కాదు,, రోత పుట్టించే విషయం కూడా. పశ్చిమ ప్రకాశం లోని మార్కాపురం పట్టణంలో ఇలాంటి వ్యవహారమే అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. పట్టణంలోని ఒక ప్రాంతానికి చెందిన కొందరు నాయకులు టీడీపీని వీడి వైకాపాలో చేరారు. ఈ సంఘటన జరిగి 24 గంటలు ముగియకముందే తిరిగి వారంతా స్వంత గూటికి చేరారు. దీనితో ఈ గుంపు ఏ పార్టీకి న్యాయం చేస్తుంది,, ఏ పార్టీకి పంగనామాలు పెడుతుందనే విషయంపై పట్టణంలో జోరుగా చర్చ జరుగుతుంది. ప్రలోభాలకు గురై పార్టీలు మారారా,, గతంలో ఉన్న పార్టీలో ఇమడలేక, లేదా మరో పార్టీ నేతకు తెలిసినవారు కాబట్టి పార్టీ మారారా అనేది కాసేపు పక్కన పెడితే, పార్టీ మారిన గంటల వ్యవధిలోనే తిరిగి స్వంతగూటికి రావడం ఏంటనేది తికమక పెట్టే విషయం. మందు కోసం, డబ్బుకోసం, మటన్ కోసం పార్టీలు మారితే, వీళ్ళంతా ఓట్లు వేసేది కచ్చితమనే దానికి ఆధారం ఏమైనా ఉంటుందా అనేది ఆలోచించాల్సిన విషయం. పది మంది పార్టీ మారితే వంద మందిగా చెప్పుకోవడం, మారకపోయినా, మారినట్లు పలువురి పేర్లు బయటకు చెప్పడం ఇలా ఒకటి కాదు,, అనేక వింతలు ఎన్నికల వేళ చూడాల్సిందే. అయితే వీరంతా పార్టీకి ఏమాత్రం విధేయులుగా ఉండరనేది జగమెరిగిన సత్యం. మార్కాపురం పట్టణంలోనే కాదు, అనేక నియోజకవర్గాల్లో ఇలాంటి తంతు కనిపిస్తూనే ఉంది. వైకాపాను వీడి, టీడీపీలో చేరేవారు, టీడీపీని వీడి వైకాపాలో చేరేవారు ఇలా ప్రతిరోజు ఏదో ఒక నియోజకవర్గంలో వస్తున్న వార్తలు కాస్త ఆశ్చర్యాన్ని కలిగించే విషయాలు. గత ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గం నుండి ప్రతి రోజు డజన్ల కొద్ది వైకాపాను వీడి టీడీపీలో చేరారు. ఈ కథనాలు రెండు ప్రధాన పత్రికలు ఫోకస్ పెట్టి మరి రాశాయి. తీరా ఎన్నికలు ముగిశాక వైకాపా అభ్యర్థి 80వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. ఇంతమంది వైకాపాను వీడి, టీడీపీలో చేరినా అంత పెద్ద గెలుపు వచ్చిందంటే, పార్టీలు మారిన వారంత అక్కడి వారే అని తేలినపోయింది. అంటే తమ పార్టీ వారికే కండువాలు కప్పి, జనాలను తమవైపుకు తిప్పుకునేందుకు పార్టీ నాయకులు ఆడుతన్న ఒక ట్రిక్‌గా భావించవచ్చు.

ఇలాంటి తతంగాలు యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు, దర్శి, ఒంగోలు నియోజకవర్గాల్లో నిత్యం చూస్తూనే ఉన్నాం. అటు నుండి, ఇటు ఇటు నుండి అటు జనాలు పార్టీలు మారుతూ మందు పార్టీలు చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్న వైనం స్పష్టంగా కనిపిస్తుంది.. చివరికంటూ ఎవరు ఏ పార్టీలో ఉంటారు,, ఎవరెవరు పార్టీలు మారి ఇరుపార్టీల వారిని మభ్యపెడతారు,, ఎవరి కొంప ముంచుతారనేది ఇపుడిపుడే తెలియకపోయినా,, ఇలా ఆయారాం,,గయారాంలతో ఇబ్బంది తప్పదనే విషయం అర్థం చేసుకోవచ్చు. జనం దృష్టిని తమవైపుకు తిప్పుకునేందుకు కొన్ని పార్టీలు ట్రిక్‌లను ప్లే చేయడం గమనించొచ్చు. ఎటొచ్చి చెప్పొచ్చేదంటే,, వచ్చేవాళ్ళని, పోయే వాళ్ళని లెక్కేసుకు కూర్చుని, గెలుస్తామనుకుంటే బొక్కబోర్ల పడడం ఖాయమనే విషయం నాయకులు గుర్తించాలి.

















అగ్ని పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి.. **9441533080**

Printed, Published and owned by K.V.Ramanarao APTEL 0548\01\1997 SV Printers Markapur. (K.Rama Krishna . 9441533080|8309890844)